రూ.300 కోట్లతో ఏలూరు అభివృద్ధి

● కౌన్సిల్‌లో 22 అంశాలకు ఆమోదం
● మేయర్ నూర్జహాన్




నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు పెదబాబు

ఏలూరు టౌన్: ఏలూరు నగరం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, రూ.300 కోట్లకుపైగా నిధులతో అనేక అభివృద్ధి పనులు చేశామని, భవిష్యత్‌తో మరింత అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళుతున్నామని నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. గురువారం ఏలూరు కార్పొరేషన్ కౌన్సిల్ హాలులో ఏర్పాటుచేసిన నగరపాలక సంస్థ సర్వసభ్య ప్రత్యేక సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. నగరంతో పాటు విలీన ఏడు పంచాయతీల సమగ్ర అభివృద్ధికి కార్యచరణ ప్రణాళికతో పనిచేస్తున్నట్టు చెప్పారు. నగర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, పార్కులు, శ్మశాన వాటికలు వంటివాటిని అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఎమ్మెల్యే ఆళ్ల నాని నాయకత్వంలో నగరంలో రూ.300 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేశామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ప్రజల వద్దకే వెళ్లి సేవలు అందిస్తున్నారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిందని వివరించారు.

● సమావేశంలో 22 అంశాలతో అజెండాను కౌన్సిల్ ముందుంచారు. అజెండాలోని 9, 13, 21వ అంశాలపై టీడీపీ కార్పొరేటర్లు అభ్యంతరాలు వ్యక్తం చేయటంతో కోఆప్షన్ సభ్యుడు ఎస్‌ఎంఆర్ పెదబాబు పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వటంతో సంతృప్తి చెందారు. ఎల్ఐజీహెచ్ క్వార్టర్స్ నిర్మాణం, దాని పూర్వ చరిత్రను పెదబాబు వివరించారు. 1964 సంవత్సరానికి సంబంధించి కార్వర్స్‌లో అద్దె నివాసం ఉన్న పిడకల చంద్రలీలమ్మ సదరు స్థలం ఆరు దశాబ్దాల పాటు నివాసం ఉంటూ వస్తున్నారని, ఆమె కుమారుడు గిడ్ల జయపాల్ స్పందన అర్జీలపై స్పందిస్తూ 399 గజాల స్థలాన్ని నిర్దేశిత మార్కెట్ ధరను అనుసరించి కొనుగోలు చేసేందుకు కౌన్సిల్ ఆమోదానికి ఉంచామని తెలిపారు.
● ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా గోదావరి కెనాల్ పక్కగా దామరాజు పార్కు ప్రాంతంలో టిఫిన్ సెంటర్ ఏర్పాటుపై సభ్యులు ప్రశ్నించగా, తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధి నిమిత్తం వెన్నెల స్వయం సహాయక సంఘానికి కేటాయించేలా కౌన్సిల్ ఆమోదానికి ఉంచామని పెదబాబు చెప్పారు.
● ఏలూరులో ఎక్కువ జనాభాగా ఉన్న కాపుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కళ్యాణ మండపం నిమిత్తం ఏలూరు ఐక్య కాపునాడు చారిటబుల్ ట్రస్ట్‌కు ఎమ్మెల్యే ఆళ్ల నాని కాపు స్థలం కేటాయించారని పెదబాబు వివరించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, నగర కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, డిప్యూటీ కమిషనర్ బాపిరాజు, కార్పొరేషన్ అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా

కోమటిలంకలో జగనన్న ఆరోగ్య సురక్ష



కోమటిలంకలో హెల్త్ రిపోర్టు అందిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 150 మందికి వైద్య సేవలు అందించారు. 40 మందికి బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించి మందులు, హెల్త్ రిపోర్టులు అందజేశారు. పలువురు రోగులను మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమాన్ని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, తహసీల్దార్ జె.శ్రీనివాసరావు, సర్పంచ్ తెనాలి యోహాన్ పరివేక్షించారు. కార్యదర్శి ప్రసాద్‌బాబు, వైసీపీ నాయకుడు ఎం రత్నం తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో దసరా సెలవుల సందర్భంగా విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు చదవడ మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. కాగితాలతో బొమ్మలు తయారు చేయడంలో శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

సీఎం జగన్‌కు టైలర్ల కృతజ్ఞతలు

ఏలూరు (టూటౌన్): నవరత్నాలలో భాగంగా జగనన్న చేదోడు పథకంలో వరుసగా నాలుగో ఏడాది రూ.10 వేలు ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సత్రంపాడు టైలర్స్ అసోసియేషన్ తరుపున టైలర్లు గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. టైలర్లు తమకు అవసరమైన వస్తు సామగ్రి, అద్దె నిమిత్తం చేదోడు సాయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సాయం పేద, మధ్యతరగతి వృత్తిదారులకు ఆత్మ స్థైర్యాన్ని ఇస్తుందని తెలిపారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ఎస్‌వీఎస్ ప్రసాద్, కె.వెంకటేశ్వరరావు, డి.ఆనంద కుమార్, కేఎస్ విమలాదేవి, టి.సుధాకర్, ఎంఆర్‌సీ శ్రీను తదితరులు ఉన్నారు.

గాజాలో మారణ హోమాన్ని ఆపాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : పాలస్తీనాలోని గాజాపై అమెరికా వత్తాసుతో ఇజ్రాయెల్ సాగిస్తున్న దాడిని, మారణ హోమాన్ని ఆపాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్ డిమాండ్ చేశారు. గాజాపై ఇజ్రాయెల్ దాడిని ఖండిస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలోని అంజుమన్ ఫంక్షన్ హాలులో సీపీఐ (ఎంఎల్) నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు అధ్యక్షతన సభ నిర్వహించారు. నాయకులు యు.వెంకటేశ్వరరావు, కేవీ రమణ మాట్లాడారు.

ఏలూరు రూరల్ మండలం ఏర్పాటు హర్షణీయం



చాటపర్రులో తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న రామచంద్రరావు

ఏలూరు రూరల్ : వైఎస్సార్ సీపీ హయాంలో ఏలూరు రూరల్ మండల ఏర్పాటు హర్షణీయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కొఠారు రామచంద్రరావు అన్నారు. గురువారం చాటపర్రులో తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ప్రజల కోరిక మేరకు 15 గ్రామాలను కలిపి ఏలూరు రూరల్ మండలంగా ఏర్పాటుచేసిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. చాటపర్రులో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగన్నరేళ్ల పాలనలో ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో రూ.300 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికే దక్కిందన్నారు. తొలుత స్థానిక శెట్టిబలిజపేటలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, సొసైటీ చైర్మన్ కోటేశ్వరరావు, సర్పంచ్ గుడిపూడి రఘు, నాయకులు మురకాడ పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు విశేష పూజలు



పవర్ పేట వాసుదేవాలయంలో లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణలో రాజ్యలక్ష్మి



పత్తేబాదలో మహాచండీ దేవి అలంకరణలో కనకదుర్గమ్మ



బావిశెట్టివారి పేటలో వనదుర్గ అలంకరణలో కనకదుర్గమ్మ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం నగరంలో వివిధ ప్రాంతాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో నిత్యపూజలు, కుంకుమ పూజలు, లలితా సహస్రనామ పారాయణలు, దేవీ ఖడ్గమాల పారాయణలు నిర్వహించారు. పవర్‌పేటలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి ఉభయ దాతలచే అలంకార పూజ చేశారు. భక్తుల గోత్ర నామాలతో సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణ చేశారు. హారతి సేవ నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. లలితా సహస్రనామ పారాయణ, అమ్మవారికి విశేష హారతి సేవ, వేద స్వస్తి, దర్బారు సేవ నిర్వహించారు. పవర్‌పేట వాసుదేవాలయం ప్రాంగణంలోని రాజ్యలక్ష్మి అమ్మవారికి ఉదయం క్షీరాభిషేకం, ఉభయ దాతలచే విశేష, నిత్య పూజలు చేశారు. అమ్మవారికి లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణ చేశారు. బాలభోగ వినియోగం, సాయంత్రం లక్ష్మి, లలితా సహస్రనామ పారాయణ, విశేష హారతులు, ఏకాంత సేవ నిర్వహించారు. రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో అమ్మవారికి మహాచండీ దేవి అలంకరణ చేసి ఎరుపు మందారపూలతో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు నగరానికి చెందిన నృత్యాంజలి కళా నికేతన్ ఆధ్వర్యంలో నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పత్తేబాద కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి మహాచండీ దేవి అలంకరణ చేశారు. బావిశెట్టివారి పేటలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి వనదుర్గాదేవి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేంద్రం విధానాలతో ఆయిల్‌పామ్ రైతుల కుదేలు

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఆయిల్ పామ్ గెలలకు ధర లేక రైతులు కుదేలవుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం ఆందోళన వ్యక్తం చేశారు. టన్ను ఆయిల్ పామ్ గెలలకు రూ.18 వేలు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో తెల్లం రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు ప్రజా, రైతాంగ సమస్యలపై తీర్మానాలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, నాయకులు డీఎన్‌వీడీ ప్రసాద్, పి.కిషోర్, ఎం.నాగమణి, జి.రాజు, బి.సోమయ్య, వై.నాగేంద్రరావు, ఎం.జీవరత్నం, జి.వెంకట్రావు, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్ మాట్లాడారు.

జూదరుల అరెస్ట్

పెదపాడు : పేకాడుతోన్న 12 మందిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. పెదపాడు మండలం ఏపూరులోని డంపింగ్‌యార్డు వద్ద పేకాట శిబిరంపై దాడిచేసి రూ.20,200, రెండు ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు.

పోలసానిపల్లి శివారులో..

భీమడోలు: మండలంలోని పోలసానిపల్లి శివారులో బుధవారం అర్ధరాత్రి పేకాట స్థావరంపై భీమడోలు పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాడుతున్న పోలసానిపల్లి గ్రామానికి చెందిన తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10,790లు నగదు, నాలుగు మోటార్‌బైక్‌లు, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

పెదపాడు: మండలంలోని వీరమ్మకుంట గ్రామంలో శతాధిక వృద్ధురాలు మృతి చెందింది. మాజీ జెడ్పీటీసీ కలిపిండి అప్పారావు తల్లి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సప్పా మోహన మురళీ అమ్మమ్మ కలిపిండి పోలమ్మ (104) గురువారం మధ్యాహ్నం మృతి చెందింది. వివిధ పార్టీల నాయకులు పోలమ్మ మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. వీరిలో సంబంగి శ్రావణ్‌కుమార్, బొమ్మి ప్రభాకరరావు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే ఆళ్ల నాని



వృద్ధుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. 118వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం 34వ డివిజన్‌లో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ప్రజల జీవన విధానం మెరుగుపడేలా ప్రత్యేక ప్రణాళికతో సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలో రూ.361 కోట్లతో అమృత్ 2.0 పథకంలో 7 విలీన పంచాయతీల్లోని సుమారు 50 వేల మంది ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించనున్నామని తెలిపారు. ఏలూరు అర్బన్‌లో ప్రజలకు గోదావరి జలాలు అందిస్తుండగా, విలీన గ్రామాల ప్రజలకు సైతం గోదావరి నీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోనూ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం త్వరలోనే చేపనున్నట్టు తెలిపారు. తొలుత నాని ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు ఏవిధంగా అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎంఆర్ పెదబాబు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కార్పొరేటర్లు, నగర కమిషనర్ వెంకటకృష్ణ, తహసీల్దార్ సోమశేఖర్ తదితరులు ఉన్నారు.

బాలలు, యువతను రక్షించాలి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : బాలలు, యువతను రక్షించాలని ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎన్ రాజశేఖర్ అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక వీటీఆర్ ఫంక్షన్ హాల్‌లో మహిళా సంరక్షణ కార్యకర్తలకు, గ్రామ వలంటీర్స్‌కు మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, బాల్య వివాహాలపై నిర్వహించిన వర్కుషాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా బాలల సంరక్షణా అధికారి సూర్య చక్రవేణి మాట్లాడుతూ బాలలను రక్షించాల్సిన ప్రాథమిక బాధ్యత తల్లి తండ్రులదే అన్నారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలైన వారిని నూజివీడు మండలం పొనసనిపల్లిలో ఏర్పాటు చేసిన బాల భవన్ ఏర్పాటు చేసిన బోస్కో డీఎడిక్షన్ సెంటర్‌కు తీసుకువస్తే మత్తు పదార్థాల నుంచి విముక్తి లభించేలా చేస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 94904 92020లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్స్ డి.రజిత, బి.నేహేమీయ, కె.ప్రియాంక, ఎస్. జాకబ్ రాజు, మహిళా సంరక్షణ కార్యకర్తలు, వలంటీర్స్ పాల్గొన్నారు.

కార్మికులకు అవగాహన

ఏలూరు రూరల్: నేరప్రవృత్తికి లోనౌతున్న బాలలను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని బాలల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ జాకబ్‌రాజు ఓ ప్రకటనలో కోరారు. గురువారం స్థానిక ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గిడ్డంగి వద్ద కార్మికులకు బాలల పరిరక్షణపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు వయస్సు గల బాలలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ మద్యం, మత్తు పదార్థాలకు బానిసలౌతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ మేనేజర్ కట్టా కృష్ణ, కార్మిక నాయకుడు టి.వెంకటేశ్వరరావు, బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ నేహేమియా తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యత, సమగ్రతకు పాటుపడాలి



మాజీ సైనికులను సన్మానించిన దృశ్యం

ఏలూరు రూరల్: దేశ సమైక్యత, సమగ్రత, దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నెహ్రూయువకేంద్రం అధికారి దూలం కిషోర్ అన్నారు. గురువారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్‌వైకే ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నా మట్టి, నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ప్రజల కర్తవ్యాన్ని గుర్తిచేసి, ప్రతి ఒక్కరినీ దేశసేవకు అంకితం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నా మట్టి, నా దేశం కార్యక్రమం చేపట్టిందన్నారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల నుంచి నేటి యువత స్ఫూర్తి పొందాలన్నారు. ఈ సందర్భంగా నాట్యాచారుడు హేమసుందర్ శిష్యులు నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. మాజీ సైనికులు దేవినేని భాస్కరరావు, గొల్ల శ్రీధర్,బి అప్పారావు దేశానికి చేసిన సేవలకు గుర్తుగా వారిని ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. తొలుత ఎన్‌సీసీ క్యాడెట్లు, సచివాలయం, ఆర్టీసీ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ, ఉపాధి హామీ పథకం సిబ్బందితో పాటు ప్రముఖ నాట్యాచారుడు హేమసుందర్ శిష్యులు జాతీయజెండా చేతబూని, మట్టి కలశాలతో ఏలూరు ర్యాలీ నిర్వహించారు. జిల్లాసెట్‌వెల్ సీఈఓ ఎండిహెచ్ మెహ్రాజ్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ప్రవీణ్‌కృష్ణ, జిల్లా పోస్టాఫీసు అధికారి పి.రాజేష్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.ఇమ్మానియేలు, ఎంపీడీఓ బి.ప్రణవి తదితరులు మాట్లాడారు.

దేశరక్షణకు పాటుపడాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారతదేశ భద్రతకు పౌరులందరూ దేశ భద్రకు పాటుపడాలని రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కె.సాయి రోహిత్ పిలుపునిచ్చారు. గురువారం కళాశాల ఈఈఈ శాఖ, ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మేరి మిట్టి – మేరా దేశ్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా అమృత కలశ యాత్ర, ఫిట్ ఇండియా ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ కూరగాయల విక్రయం



ఏలూరు వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట కూరగాయలు అమ్మకాలు చేపట్టిన దృశ్యం

ఏలూరు రూరల్ : ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలు ప్రజలు కొనుగోలు చేయాలని వ్యవసాయశాఖ ఏడీ ఎ.సుబ్బారావు సూచించారు. గురువారం డీపీఎం తాతారావు ఆదేశాల మేరకు మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో పలువురు రైతులు ఏలూరు వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట కూరగాయలు, ఆకుకూరల అమ్మకాలు చేపట్టారు. వీటిలో జీవామృతంతో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, బియ్యం, బెల్లం, పసుపు, తేనే, పప్పులు ఉన్నాయి. అమ్మకాలను ప్రారంభించిన వారిలో జిల్లా మార్కెటింగ్ ఎస్ఎఫ్ఏ అనంత పద్మనాభం, యూనిట్ ఇన్‌చార్జి సీహెచ్ నాగమణి, రాజేశ్వరి ఉన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

పెదవేగి : పేదలకు సొంతిల్లు ఉండాలన్న ఆశయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిలు కృషి చేస్తున్నారని ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని జగనన్న కాలనీల్లో నూతనంగా నిర్మించిన పంజగల చిన్నారావు నాగమణిల నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో కొఠారు పాల్గొన్నారు. గృహ యజమానులను అభినందించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	25
డీ.తిరుమల ఏలురు బీహెచ్ఈఎల్	22.15	34
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	26
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	10
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	16
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	09
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	22
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	20
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	27
ఏలూరు -తిరుపతి	16.00	4830	రద్దు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	22	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	38
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	08
బెండకాయలు	20	కంద	50
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	38
కాకర కాయలు	24 - 28	కీరా దోస	44
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	20	అల్లం	130
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20-35
దొండకాయలు	20	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	38	తోటకూర	10
గోరుచిక్కుడు	28	గోంగూర	06
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	15	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	30
		నిమ్మకాయలు (డజను)	--